

# సూర్య

www.suryaa.com

19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం,20 డిసెంబర్ 2025

8 పేజీలు


# నన్నయ వర్సిటీలో అభివృద్ధి పథం

**- రూ.33.80 కోట్ల భవనాలను ప్రారంభించిన మంత్రి నారా లోకేష్**

**- నన్నయ్య గడ్డపై అక్షర సేద్యం - ఇంజనీరింగ్ మేనేజ్మెంట్ బ్లాక్‌లను ప్రారంభించిన మంత్రి లోకేష్**







**రాజమహేంద్రవరం నుంచి ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యావకాశాల కూడలిగా, అత్యాధునిక వసతులతో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. శుక్రవారం వర్సిటీలో పర్యటించిన రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్, సుమారు రూ. 33.80 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన పలు విద్యా భవనాలను ప్రారంభించారు. ఘన స్వాగతం – ఆధ్యాత్మిక శోభమంత్రి లోకేష్ రాకతో విశ్వవిద్యాలయం కోలాహలంగా మారింది. నూతనంగా నిర్మించిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ భవనం వద్దకు చేరుకున్న మంత్రికి, వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ఆధ్వర్యంలో వేద పండితులు పూర్ణకుంభంతో,మంత్రోచ్చారణలతో ఘనంగా స్వాగతం పలికారు.

అనంతరం మంత్రి నన్నయ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రారంభించిన కీలక భవనాలు ఇవే..విద్యారంగానికి పెద్దపీట వేస్తూ మంత్రి లోకేష్ ఈక్రింది విభాగాలను జాతికిఅంకితం చేశారు.

– **ఇంజనీరింగ్ కళాశాల:** రూ. 20.05 కోట్లతో నిర్మించిన అత్యాధునిక ఇంజనీరింగ్ భవనం.

– **పరీక్షల విభాగం:** రూ. 8.25 కోట్లతో నిర్మించిన ఎగ్జామినేషన్ బ్లాక్.

– **మేనేజ్మెంట్ స్టడీస్:** రూ. 5.50 కోట్లతో నిర్మించిన స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ భవనం.మంత్రి ఈ సందర్భంగా శిలాఫలకాలను ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి భవనాలను పరిశీలించారు. వర్సిటీలో కల్పిస్తున్న మౌలిక వసతులు విద్యార్థుల పరిశోధనా సామర్థ్యాన్ని పెంచుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

- తరువాయి 2లో..



# డిప్యూటీ సీఎం పర్యటనను విజయవంతం చేద్దాం

**–హెలిప్యాడ్‌ను పరిశీలించిన మంత్రి కందుల దుర్గేష్**

**పెరవలి,మేజర్‌న్యూస్ :** నిడదవోలు నియోజకవర్గానికి పెరవలి మండలానికి తొలిసారి విచ్చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటనను విజయవంతంచేద్దామని మంత్రి కందులదుర్గేష్ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజానీకానికిపిలుపునిచ్చారు,ఈ సందర్భంగా డిసెంబర్ 19వ తేదీ శుక్రవారం ఉదయం నుండి సభాస్థలి వద్దే ఉండి స్కిల్ డెవలప్ మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, కొవ్వూరు ఆర్డీవో రాణిసుస్మిత,పెరవలి ఎమ్మార్వో, అధికారులతో కలిసి శంకుస్థాపన ఏర్పాట్లను పర్యవేక్షించారు. పంచాయతీరాజ్ మరియు రూరల్ డెవలప్ మెంట్ కమిషనర్ ఎం.కృష్ణ తేజతో ఏర్పాట్లపై చర్చించారు. దగ్గరుండి హెలిప్యాడ్‌ను పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశమున్ననేపథ్యంలోఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో

- తరువాయి 2లో..

# క్రీస్తు పుట్టుక ప్రపంచానికి పర్వదినం

**– శాంతి, దయా గుణాలకు నిదర్శనంగా నిలిచిన ఏసుక్రీస్తు జీవిత విధానాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలి..**

**– జిల్లాలో మత సామరస్యానికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి అసాంఘిక శక్తులనైన కఠినంగా అణిచివేయడం జరుగుతుంది..– జిల్లా కలెక్టర్ షణ్మోహన్**

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ప్రపంచమంతా జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్ అని, శాంతి, దయా గుణాలకు నిదర్శనంగా నిలిచిన ఏసుక్రీస్తు జీవిత విధానాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మైనార్టీ సంక్షేమ శాఖ, ఏపీ స్టేట్ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కాకినాడ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ సమావేశ మందిరంలో క్రిస్మస్ ఐటి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్, శాసన మండల సభ్యులు కర్రి పద్మశ్రీ, కాకినాడ పట్టణ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేసి, క్యాండిల్స్ వెలిగించి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ.. క్రీస్తు పుట్టుక




ప్రపంచానికి పర్వదినం అని ప్రపంచం వ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్ పండుగ అన్నారు. ఏసుక్రీస్తు చూపిన ప్రేమ, శాంతి, దయ గుణాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయని ఆయన తెలిపారు. జిల్లాలో మతసామరస్యానికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే

- తరువాయి 2లో..

# పండుగ పూట 'సైబర్' ఉచ్చు

**– ఉచితాల ఆశ చూపి నిలువు దోపిడీ..మీ అప్రమత్తతే మీ సంపదకు రక్షణ**

**– జాగ్రత్త వహించమంటున్న కాకినాడ జిల్లా ఎస్పీ**

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** పండుగ సీజన్ వస్తోందంటే చాలు.. అటు ఆన్‌లైన్ వ్యాపారాలతో పాటు ఇటు సైబర్ నేరగాళ్లు కూడా తమ వేటను ముమ్మరం చేస్తారు. "మీకు బంపర్ గిఫ్ట్ తగిలింది","ఇంట్లో కూర్చుని లక్షలు సంపాదించండి", "ఫ్రీ డేటా రీఛార్జ్" అంటూ వచ్చే మెసేజ్‌ల వెనుక పెద్ద మోసందాగిఉందని వీటిపై ఎంతో అప్రమత్తంగా ఉండాలని కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ప్రజలకు జాతీయ తెలుగు దినపత్రిక సూర్య ద్వారా అప్రమత్తం చేశారు. నేరగాళ్లు అనుసరిస్తున్న కొత్త పద్ధతులు మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన ఈ సందర్భంగా తెలియచేసిన కీలక మార్గదర్శకాలు ప్రజలకు ఇలా ఉన్నాయి.

**1. మాయ చేసే మెసేజ్‌లు – 'క్లిక్' చేస్తే ప్రమాదమే!**

క్రిస్మస్,నూతన సంవత్సర కానుకలపేరుతో వాట్సాప్, టెలిగ్రామ్ లేదా ఈమెయిల్‌లలో వచ్చే లింక్‌ల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలి. ఈ లింక్‌లను క్లిక్ చేయడం ద్వారా మీ ఫోన్‌లోకి మాల్వేర్ ప్రవేశించే ప్రమాదం ఉంది. నిలి ఎపికె ఫైల్స్: అపరిచితులు పంపే యాప్ ఫైల్స్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ ఇన్‌స్టాల్



చేయవద్దు. ఇవి మీ ఫోన్ నియంత్రణను నేరగాళ్ల చేతుల్లోకి తీసుకెళ్తాయి.

**2. 'డిజిటల్ అరెస్ట్' అనేది ఒక పెద్ద అబద్ధం**

ఇటీవల కాలంలో ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్న 'డిజిటల్ అరెస్ట్' గురించి ఎస్పీ స్పష్టతనిచ్చారు. చట్టంలో డిజిటల్ అరెస్ట్ అనే పదమే లేదని, పోలీస్ లేదా సీబీఐ అధికారులు

- తరువాయి 2లో..

# పల్స్ పోలియో నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** 21వ తేదీ ఆదివారం జరగబోయే పల్స్ పోలియో కార్యక్రమం అన్ని గ్రామాల్లోనూ విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అడ్డతీగల ఎంపీడీవో కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు ఐసిడిఎస్ సిబ్బంది ఏఎన్ఎంలకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కుమార్ మాట్లాడుతూ మండలంలో ఉన్న అధికారులు అందరూ ప్రజల్లో పల్స్ పోలియోపై అవగాహన కల్పించాలని గ్రామాల్లో ఏర్పాటు చేసిన బూతుల పరిధిలో ఐదు సంవత్సరాలలోపు పసిపిల్లలందరికి పోలియో చుక్కలు విధిగా వేయాలని సూచించారు. అడ్డతీగల మండలంలోని 22 పంచాయతీల పరిధిలో మొత్తం 81 సెంటర్లో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు గ్రామాల్లో పల్స్ పోలియోలో పాల్గొనే పంచాయతీ సిబ్బందినీ తనతో పాటు రెవెన్యూ అధికారులు సమన్వయం చేసుకోవాలని అంగన్వాడి వర్కర్లను ఐసిడిఎస్ అధికారులు, ఏఎన్ఎం లను వైద్య అధికారులు సిబ్బంది సమన్వయం చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమావేశంలో సూచించారు. ఎల్లవరం దుప్పలపాలెం వైద్యాధికారులు దేవి ప్రియాంక, స్పందన మాట్లాడుతూ భవిష్యత్తులో అంగవైకల్యం రాకుండా ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలని ప్రతి తల్లిదండ్రులను అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ప్రస్తుతం మండలంలో 2883 మంది ఐదు సంవత్సరాలలోపు పిల్లలు ఉన్నట్లుగా గుర్తించినట్లు వెల్లడించారు. స్థానిక ఎమ్మార్వో దొరకయ్య మాట్లాడుతూ 21వ తేదీ ఆదివారం మండలంలో మొత్తం 324 మంది సిబ్బంది పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

# పండుగ పూట 'సైబర్' ఉచ్చు

మొదటిపేజి తరువాయి

ఎవరూ వీడియో కాల్స్ చేసి బెదిరించరని ఆయన స్పష్టం చేశారు. అటువంటి కాల్స్ వస్తే ఏమాత్రం భయపడకుండా వెంటనేపోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

**3. వ్యక్తిగత సమాచారం – పదిలం!**

మీ పాన్ కార్డ్ నంబర్, బ్యాంక్ వివరాలు, ఓటీపీ వంటి వివరాలను అపరిచిత లింక్‌లలో పొందుపరచవద్దు. కేవలం మీ ఫోన్ నంబర్ మరియు ప్రాథమిక వివరాల ఆధారంగానే మీ బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేసే సాంకేతికత నేరగాళ్ల వద్ద ఉందని ఆయన హెచ్చరించారు.

మీరు సైబర్ మోసానికి గురైతే ఏం చేయాలి?

ఒకవేళ మీరు సైబర్ నేరగాళ్ల బారిన పడితే, ఆలస్యం చేయకుండా ఈ క్రింది చర్యలు తీసుకోండి:

నేషనల్ సైబర్ హెల్ప్ లైన్ : వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయండి.

ఆన్‌లైన్ ఫిర్యాదు : www.cybercrime.gov.in పోర్టల్‌లో నేరాన్ని రిపోర్ట్ చేయండి.స్థానిక పోలీస్ స్టేషన్ : మీ పరిధిలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి నేరుగా ఫిర్యాదు చేయండి. "సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నేరగాళ్లు పంథా మార్చుకుంటున్నారు. మీ అప్రమత్తతే మీ సంపదకు రక్షణ." అని జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ హెచ్చరించారు.

# మెగా మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి





**– ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే శిరీష దేవి**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో వివిధ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు ఈ నెల 21వ తేది ఆదివారం ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రంపచోడవరం వైటీసి వద్ద ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా మెడికల్ క్యాంపును సద్వినియోగ పరచుకోవాలని రంపచోడవరం శాసనసభ్యురాలు మిరియాల శిరీష దేవి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నోక్వాల్ వేరు వేరు ప్రకటనల్లో విజ్ఞప్తి చేసారు. ఈ నెల 21వ తేదీ ఆదివారం ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా రంపచోడవరం వైటిసి సెంటర్‌లో మెగా మెడికల్ శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని రిటైర్డ్ మాజీ డీజిపి రాజేంద్ర కుమార్ తెలిపారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఏజెన్సీ ప్రాంత ప్రజలు వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి మెగా మెడికల్ క్యాంపు కార్యక్రమానికి హాజరవుతున్నారని రంపచోడవరం శాసనసభ్యురాలు మిరియాల శిరీష దేవి, మాజీ డిజిపి రాజేంద్ర కుమార్ తెలిపారు. ఈ మెడికల్ క్యాంపు ఆదివారం ఉదయం 9 గంటల 30 నిమిషాల నుండి సాయంకాలం నాలుగు గంటల వరకు యూత్ ట్రైనింగ్ సెంటర్లో నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఇందులో జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, హార్ట్ చెకప్, గుండె నొప్పులు, బీపి శ్వాస సమస్యలు, నెఫ్రాలజీ కిడ్నీల పనితీరు పరీక్షలు, కిడ్నీ ఇన్ఫెక్షన్, కిడ్నీ బలహీనత, ఆర్థోపెడిక్ ద్వారా ఎముకలు, కీళ్ల నొప్పులు, నడుము, మెడ నొప్పులు, ఎముకలు ఫ్యాక్చర్, జాయింట్ సమస్యలు, యూరాలజీ, మూత్ర సమస్యలు, రాళ్ల సమస్యలు, ఆంకాలజీ, నోటి క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ అండ్ గర్భాసాయ క్యాన్సర్ స్క్రీనింగ్, డెర్మటాలజీ చర్మ సమస్యలు, ఇన్ఫెక్షన్లు, ఎలర్జీలు, పర్మనాలజీ, ఆస్మా, దగ్గు, ఊపిరితిత్తుల పరీక్షలు, ఈఎన్టీ, చెవి నొప్పులు, ముక్కు సమస్యలు, గొంతు ఇన్ఫెక్షన్లు, దంత వైద్యం, పళ్ళ నొప్పులు, పళ్ళు శుభ్రపరచడం, దంత ఇన్ఫెక్షన్లు, మహిళ వైద్యం, గర్భిణీ పరీక్షలు, స్కానింగ్, హార్మోన్ సమస్యలు, పిల్లల వైద్యం, చిన్నపిల్లలకు చెకప్, టీకాలపై అవగాహన కల్పించడం తో పాటు వ్యాధులు అన్నిటికీ జిఎస్ఎల్ & జిఎస్ఆర్ ఆసుపత్రుల సహకారంతో సంబంధిత వైద్య నిపుణులతో వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు ఇవ్వడం జరుగుతుందని వారు తెలిపారు. గిరిజన ప్రాంతంలో వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారు, అదేవిధంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు ప్రత్యేక మెగా మెడికల్ క్యాంపు సద్వినియోగ పరుచుకోవాలని వారు కోరారు. ఈ మెగా మెడికల్ క్యాంపుకు వచ్చే వారికి భోజన, త్రాగునీటి సదుపాయం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా మెగా మెడికల్ క్యాంపుకు సంబంధించిన ఏర్పాట్లును వారు పరిశీలించి సూచనలు చేసారు.

# నన్నయ వర్సిటీలో అభివృద్ధి పథం

మొదటిపేజి తరువాయి

**–విద్యార్థులతో లోకేష్ సందడి.. సెల్ఫీల వెల్లువ**

కార్యక్రమం అనంతరం మంత్రి లోకేష్ విద్యార్థులతో ముచ్చటించారు. ప్రాంగణంలో నడుచుకుంటూ వెళ్తున్న మంత్రిని చూసి విద్యార్థులు ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. మంత్రి విద్యార్థుల వద్దకు వెళ్లి వారిని పలకరిస్తూ, చిరునవ్వుతో సెల్ఫీలు దిగారు. యువతలో స్ఫూర్తి నింపుతూ మంత్రి చేసిన ఈ పర్యటన వర్సిటీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ ఆచార్య కె.వి. స్వామి, ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, ఆదిరెడ్డి వాసు, రూడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, కళాశాల విద్య కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, జేసీ మేఘా స్వరూప్ తదితర అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం పర్యటనను విజయవంతం చేద్దాం

మొదటిపేజి తరువాయి

ఏపీఐఐడిసి చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి నరసింహ కిషోర్, డి.ఎస్.పి జి దేవకుమార్, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, ఇతర అధికారులు, కూటమి నాయకులు, మేఘ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# క్రీస్తు పుట్టుక ప్రపంచానికి పర్వదినం

మొదటిపేజి తరువాయి

ఎలాంటి అసాంఘిక శక్తులైన కఠినంగా అనిచివేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఈ స్పష్టం చేశారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం, గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శాంతి భద్రతలో కాపాడడంలో జిల్లా అధికార యంత్రంగానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని ఆయన తెలిపారు. భారత రాజ్యాంగం ప్రకారం జిల్లాలో శాంతిభద్రతలను, మతసామరస్యాన్ని కాపాడడంలో అందరి సహకారంతో అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఏసుక్రీస్తు జీవన విధానం ప్రజల మనగడ, జీవన శైలిని మార్చాయని, ఆయన చేసిన ప్రాణత్యాగానికి ప్రపంచ దేశాలన్నీ ఆయనను అనుకరిస్తున్నాయని ఆయన జీవన విధానం అందరికీ స్ఫూర్తిగా నిరుస్తుందన్నారు. ఈ క్రిస్మస్ పండుగ జిల్లా ప్రజల జీవితాలు వారి కుటుంబాల్లో ఆనందం, సంతోషాన్ని, వెలుగుల్ని తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అందరికీ క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కాకినాడ పట్టణ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. క్రీస్తు జన్మదినం సందర్భంగా అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రిస్మస్ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకరమైన విషయం అన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హెూదా కల్పించాలని ఉద్దేశంతో మొట్టమొదటిసారిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉండగానే తీర్మానం చేయడం జరిగిందన్నారు. ఆయన మతసామరస్యాన్ని పాటిస్తూ అన్ని మతాల ప్రజలకు సముచిత స్థానం కల్పిస్తున్నారని ఎమ్మెల్యే కొండబాబు తెలిపారు. అక్కడక్కడ చిన్న చిన్న సంఘటనలు చోటు చేసుకున్నప్పటికీ అవి వ్యక్తిగత ప్రయోజనాలతో కూడుకున్నవే తప్ప.. ప్రభుత్వానికి ఏమాత్రం సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. దేశంలో ఎవరు మతాన్ని వారు పూజించుకోవడం, గౌరవించుకోవ డం స్వతంత్రమని, అన్ని మతాలు ప్రశాంతంగా తమ కార్యకలాపాలు నిర్వహించుకోవడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి, భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెండుగా కల్పిస్తుందన్నారు. ఈ క్రిస్మస్ ప డుగ సందర్భంగా కాకినాడ పట్టణ ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే కొండబాబు ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు చూపిన ప్రేమను, అనురాగాన్ని ప్రతి ఒక్కరు అలవర్చుకోవడం ద్వారా ప్రశాంత జీవితాన్ని పొందవచ్చున్నారు. అన్ని మతాలవారు జరుపుకునే పండుగలను గౌరవించు కుంటూ సోదర భావాన్ని కలిగి జీవించాలని ఆమె పేర్కొన్నారు. అనంతరం క్రిస్మస్ ఐటి సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మత్స్య శాఖ విశ్రాంత జేడీ జయరావు బృందం.. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు బైబిల్ గ్రంథాలను అందజేశారు. తొలుత నవ భారతి స్కూల్ విద్యార్థులు దర్శించిన క్రిస్మస్ గీతాలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సునీల్ కుమార్, క్రైస్తవ మత పెద్దలు జార్జి శ్రీమంతుల, రెవ. జోసఫ్ బెన్నీ, జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ దొమ్మేటి సామ్యూల్ సాగర్, బిషప్ పి.ఇశాక్, పరిమి హైజాక్, వై.పాపారావు, కాకినాడ జిల్లా ఏడు నియోజకవర్గాల రీజియన్ ప్రెసిడెంట్ సీరం ఐజాక్, ఎస్సీ డైరెక్టర్ అప్పారావు, పీఎం 15 సభ్యులు పాల్గొన్నారు.

# త్వరలోనే జనసేన పార్టీ కమిటీల నియామకం

– జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి




**శంఖవరం, మేజర్ న్యూస్ :** జనసేన పార్టీలో రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకూ ఖాళీగా ఉన్న నియోజకవర్గాల కమిటీల నియామకాలను త్వరలోనే చేపడతామని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి వెల్లడించారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పార్టీ కార్యాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా టెలికాం అడ్వయిజరీ బోర్డు సభ్యులు మేకల కృష్ణ, విజయవాడ డివిజనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సభ్యులు గొర్లి నాగేశ్వరరావు, ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ ఐటి కోఆర్డినేటర్ ఇటంశెట్టి రాజేష్, కాకినాడ జిల్లా జనసేన పార్టీ పార్లమెంటరీ ఎన్నికల కమిటీ సభ్యులు గౌతు లక్ష్మి, రావూరి వెంకటేశ్వరరావు, వేల్పుల నరసింహమూర్తి మర్యాద పూర్వకంగా కలిసారు. ఆయనకు పూల బొకెని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇంకా ఆయనతో వారు మాట్లాడుతూ... ప్రత్తిపాడు నియోజకవర్గం జనసేనపార్టీకి ఇంఛార్జిగా ఎవరూ లేరని తెలిపారు. ఫలితంగా ఎన్.డి.ఏ. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు నిర్వహణ కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ సమన్వయం సాధించడం లేదని, కొంతమంది జనసేన నాయకులకు ప్రోటోకాల్ ను పాటించడం లేదని, జనసేన పార్టీకి నియోజకవర్గ ఇంఛార్జి ఉండి ఉంటే గనుక ఇటువంటి పరిస్థితి రాదని, అన్నీ ఇంఛార్జి చూసుకునే వారని తమ అసంతృప్తిని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరికి జిల్లా టెలికాం అడ్వయిజరీ బోర్డు సభ్యులు మేకల కృష్ణ, విజయవాడ డివిజనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సభ్యులు గొర్లి నాగేశ్వరరావు, కాకినాడ జిల్లా జనసేన పార్టీ పార్లమెంటరీ ఎన్నికల కమిటీ సభ్యులు గౌతు లక్ష్మి, రావూరి వెంకటేశ్వరరావు, వేల్పుల నరసింహమూర్తి ముక్త కంఠంతో చెప్పారు. దీనికి స్పందించిన ఆయన త్వరలోనే పార్టీలో ఖాళీగా ఉన్న నియోజకవర్గాల కమిటీలను నియమిస్తామని, ప్రోటోకాల్ విషయమై త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి పరిస్థితులను సమన్వయం చేస్తామని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి వెల్లడించారు.

# పవన్ ఆదర్శ పాలన చూసి జనసేన పార్టీలోకి చేరా

– పితాని రాము




**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** ఎన్డీఏ ప్రభుత్వ పాలనలో డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మాత్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదర్శ పాలన చూసి జనసేన పార్టీలోకి చేరానని తూరంగి మాజీ ఎంపీటీసీ పితాని రాము స్పష్టం చేశారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ శాసనసభ్యులు పంతం నానాజీ సమక్షంలో జనసేన పార్టీలోకి చేరడం జరిగిందన్నారు. గతంలో 1995లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో తూరంగి ఎంపీటీసీగా పనిచేయడం జరిగిందన్నారు. గత 10 ఏళ్ల బట్టి రాజకీయాలకు దూరంగా ఉంటున్నా పత్రిక సంపాదకులుగా ప్రజలకు దగ్గరగానే ఉన్నానన్నారు.

రాష్ట్రంలో పంచాయతీ శాఖ మంత్రిగా పంచాయతీల అభివృద్ధికి చేస్తున్న కృషికి తాను ఆకర్షితుడై పార్టీలోకి వచ్చానన్నారు. కాకినాడ శాసనసభ్యులు పంతం నానాజీ ఆదేశానుసారం నియోజకవర్గ అభివృద్ధికి పనిచేస్తానన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంతో పాటు జిల్లాలో పలు ప్రాంతాలలో ఉన్న నాయకులతో తనకు సత్సంబంధాలు ఉన్నాయన్నారు. జనసేన పార్టీ అభివృద్ధికి తాను కట్టుబడి ఉంటానని పితాని రాము హామీ ఇచ్చారు.

# సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త.. ట్రాఫిక్ రూల్స్ పాటించండి!

– కల్పనా సెంటర్ వద్ద పోలీసుల అవగాహన సదస్సు




**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ నగరంలోని కల్పనా సెంటర్ వద్ద ట్రాఫిక్ పోలీసులు వాహనదారులు, పాదచారులకు సైబర్ నేరాలు మరియు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్-1 ఇన్‌స్పెక్టర్ ఎన్. రమేష్, ఎస్సై ఎల్. భీష్మ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, అతివేగం చట్టరీత్యా నేరం అని తెలిపారు. మాడిఫైడ్ సైలెన్సర్లు వాడకూడదని, ప్రభుత్వం జారీ చేసిన నంబర్ ప్లేట్లనే వాడాలని పోలీసులు స్పష్టం చేశారు. ఆన్‌లైన్ లోన్లు, ఫేక్ జాబ్స్, 'డిజిటల్ అరెస్ట్' వంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర సహాయం కొరకు 112 / 100; సైబర్ ఫిర్యాదుల కొరకు 1930; అటవీ సమాచారం కొరకు 1926 నెంబర్లకు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది మరియు వాహనదారులు పాల్గొన్నారు.

## వెంకన్న నిత్య అన్నదాన పథకానికి విరాళాల వెల్లువ





**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి నిత్య అన్నదాన పథకానికి శుక్రవారం అంబేద్కర్ కోనసీమ జిల్లా రవాణా అధికారి ఎస్.టి.వి.రాఘవ కుమార్ వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి స్వామిని దర్శించుకుని రూ.1,01,116లు; విజయవాడకు చెందిన అనురాధ మోహన్, వారి కుటుంబ సభ్యులు రూ.1,08,000లు విరాళంగా సమర్పించినారు. వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శేష వస్త్రములతో సత్కరించారు. దాతలకు ఛైర్మన్ ముదునూరి వెంకట్ రాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, అర్చకులు, సిబ్బంది స్వామివారి చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ముదునూరి రాంబద్ర రాజు, రావులపాలెం డిపో మేనేజర్ వై.వి.వి.ఎన్. కుమార్, స్టేషన్ మేనేజర్ ఎం.గురవయ్య నాయుడు లు ఉన్నారు.

## వెంకన్న ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యాలే లక్ష్యం

– అభివృద్ధి పనులను పరిశీలించిన అధికారులు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యాలే లక్ష్యంగా పనులు చేస్తున్నట్లు ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు లు అన్నారు. శుక్రవారం ఆలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను దేవాదాయ శాఖ డిఈ ఉదయ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాలతో ఆలయం వద్ద శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. వకుళ మాత అన్నదాన భవనం నిర్మాణం, కోనేరు మరియు స్వాతంత్ర సమరయోధుల స్థూపం పనులు జరుగుతున్నాయని, భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రతిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ముదునూరి రాంబద్ర రాజు,కూటమి నాయకులు ఉన్నారు.

## ప్రైవేట్ సెక్టార్లలో యువతకు ఉపాధి అవకాశాలు



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో చదువుకున్న యువతీ యువకులకు ప్రైవేట్ సెక్టార్లలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సంబంధిత అధికారులతో సంప్రదించడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ డెవలప్మెంట్ కార్యాలయాన్ని శుక్రవారం ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో చదువుకున్న గిరిజన యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఏ ప్రైవేట్ సెక్టార్లలో ఉపాధి అవకాశాల కొరకు ఎవరెవరిని సంప్రదించారో ఆయన ఆరా తీశారు. ఈ ప్రాంతంలోని యువతీ యువకులకు ప్రైవేట్ సెక్టార్లలో ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా సంబంధిత అధికారులతో సంప్రదించి, ఉపాధి అవకాశాలు కల్పించడానికి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

సూర్య
www.suryaa.com

మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678

అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ,
ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు,
మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# త్రాగునీటి సరఫరా ప్రాంగణంలో విగ్రహాల ఏర్పాటు సమంజసం కాదు

– నగరంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న బిజెపి నాయకులు
– అధికారులు చిత్తశుద్ధితో నిబంధనలు అమలు చేయాలి
: సిపిఎం డిమాండ్




**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ నగర పాలక సంస్థ త్రాగునీరు సరఫరా ప్రాంగణంలో నిర్మాణాలు తొలగించి వాజ్‌పాయ్ విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు చేయడం సమంజసంగా లేదని సిపిఎం కాకినాడ నగర కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు శుక్రవారం ఉదయం సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ విగ్రహాలు ఏర్పాటు చేయడంలో ఎవరికీ అభ్యంతరం ఉండదని తెలిపారు. కాకినాడలో పార్కులు, సామాజిక స్థలాల్లోను, బోటు క్లబ్ బయట విగ్రహాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే కాకినాడ నగర పాలక సంస్థ తాగునీటి సరఫరా విభాగం చాలా కీలకమైన ప్రాంతం అని, ఎవరైనా, ఎప్పుడైనా ఆ ప్రాంగణంలో సంచరించే అవకాశం కుదరదన్నారు. గతంలో మూడు లైట్ల సెంటర్ లో ట్రాఫిక్ ఇబ్బంది కలుగుతుందని, ఉన్న బస్ స్టాప్‌నే తొలగించారన్నారు. ఇప్పుడు అదే ప్రాంతంలో హడావిడిగా విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. పాలకవర్గం లేని సమయంలో ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకుని నిర్ణయాలు చేయాల్సిన అధికారులు ఏకపక్షంగా, నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. నగర పాలక సంస్థ ఉన్నతాధికారులు బిజెపి నాయకులకు వంతపాడడం సమంజసంగా లేదన్నారు. నెల రోజుల క్రితం గాంధీ నగర్ పార్క్ దక్షిణం రోడ్‌లో గల మహ్మద్ అలీ మార్గ్ బోర్డు తొలగించిన ఘటనపై కూడా అధికారుల వైఖరి చిత్తశుద్ధిగా లేదన్నారు. నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారిగా ఉన్న జిల్లా కలెక్టర్ వారు నిబంధనలు అమలు చేయించాలన్నారు. నగర పాలక సంస్థ ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్న ఎంపీ, ఎమ్మెల్యే లు కూడా కాకినాడ పేరుకు వన్నె తెచ్చే విధంగా నిర్ణయాలు చేయాలని సిపిఎం కోరుతుందన్నారు. ఈ సమావేశంలో పలివెల వీరబాబుతో పాటు మలక వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, ఎం.హరనాథ్, జి.ప్రసాద్ తదితరులు ఉన్నారు.

# వెబ్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్న బెన్నబాబు



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం గ్రామానికి చెందిన ఆర్ఎంపి వైద్యుడు పదిలం బెన్నబాబు అనేక సేవా కార్యమాలు చేస్తూ అన్నవరం పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలతో పాటుగా వివిధ సేవా కార్యక్రమాలు అందిస్తున్నందుకు గాను మరియు 2025వ సంవత్సరంలో అనేక సంస్థల నుండి అవార్డులు మరియు పురస్కారాలు అందుకున్న సందర్భంగా 2025వ సంవత్సరానికి వెబ్ వరల్డ్ రికార్డు సు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పదిలం బెన్నబాబు మాట్లాడుతూ తనకు వెబ్ సెట్‌లో స్థానం కల్పించి వెబ్ వరల్డ్ రికార్డుకు ఎంపిక చేసినందుకు చాలా ఆనందంగా ఉందని తెలిపారు.

# అన్నవరం దేవస్థానంలో దర్శన ధరల పెంపు ప్రతిపాదన





## – భక్తుల నుంచి అభిప్రాయాల సేకరణ

**అన్నవరం, మేజర్ న్యూస్ :** రత్నగిరిపై వెలసిన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో పలు రకాల దర్శనాలు మరియు సేవా టికెట్ల ధరలను పెంచాలని దేవస్థానం అధికారులు ప్రతిపాదించారు. ఈ మేరకు కార్యనిర్వహణాధికారి ఒక సర్క్యులర్‌ను శుక్రవారం విడుదల చేస్తూ, ధరల మార్పుపై భక్తులు, స్థానిక గ్రామస్థుల నుంచి సలహాలు, సూచనలు మరియు అభ్యంతరాలను కోరారు.

ప్రతిపాదిత ధరల వివరాలు ఇవే..

ప్రస్తుతం ఉన్న ధరలకు, ప్రతిపాదించిన కొత్త ధరలకు మధ్య గల వ్యత్యాసాన్ని పరిశీలిస్తే సేవా వివరాలు, ప్రతిపాదించిన ధరలు ఇలా ఉన్నాయి. అంతరాలయ, యంత్రాలయం దర్శనం ఇప్పటివరకు రూ.50 ఉండగా రూ.100కి పెంచేలా ప్రతిపాదన. అదేవిధంగా పంచ హారతుల సేవ ప్రధానాలయంలో ఇప్పటివరకు రూ.500 టిక్కెట్‌కి ఇద్దరికి ప్రవేశం ఉండగా రూ.500 టిక్కెట్‌కి ఒక్కరికి ప్రవేశం ఉండేలా మార్పనున్నారు. మఖా నక్షత్రం రోజున అభిషేకం దంపతులకు రూ.3,000 ఉండగా వాటిని దంపతులకు రూ.5,000లకి పెంచడానికి పెంచడానికి ఏర్పాట్లు చేయనున్నారు.

ముఖ్య మార్పులు:

ప్రసాదం: పంచ హారతుల సేవలో గతంలో ఇద్దరు భక్తులకు అనుమతి ఉండగా, ఇప్పుడు ఒక్కరికే పరిమితం చేస్తూ ప్రసాదం పరిమాణాన్ని 150 గ్రాములకు పెంచాలని నిర్ణయించారు.

వయోపరిమితి : పైన పేర్కొన్న సేవలకు 10 ఏళ్లు పైబడిన పిల్లలకు కూడా విడిగా టికెట్ తీసుకోవాలని ప్రతిపాదనలో పేర్కొన్నారు.

అభ్యంతరాలకు 30 రోజుల గడువుని ఈ ధరల పెంపుపై భక్తులకు ఏవైనా అభ్యంతరాలు లేదా సూచనలు ఉంటే ఈ సర్క్యులర్ విడుదలైన 30 రోజుల్లోపు అంటే జనవరి 20, 2026 లోపు తెలియజేయాలని అధికారులు సూచించారు.

అభిప్రాయాలను పంపాల్సిన చిరునామాని భక్తులు తమ అభిప్రాయాలను లేఖ ద్వారా గానీ లేదా ఈ క్రిందిమార్గాల ద్వారా దేవస్థాన కార్యనిర్వహణాధికారికి పంపవచ్చు.ఈమెయిల్, endow-eoanna@gov.in ఫోన్/వాట్సాప్: 9490712066, 9491213887, 9908411777. సామాన్య భక్తులపై భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ ప్రతిపాదనలపై ప్రజలు పెద్ద ఎత్తున స్పందించే అవకాశం ఉంది.

# వెదురు ఉత్పత్తుల అభివృద్ధికి ప్రోత్సాహం





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో వెదురుతో తయారుచేసిన ఉత్పత్తుల అభివృద్ధి విషయంలో గిరిజనులను ప్రోత్సహించడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. రంపచోడవరం మండలం సూర్లవాడ గ్రామంలో గిరిజనులు తయారుచేసిన వెదురు వస్తువులను పిఓ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని గిరిజనులు తయారుచేసిన వెదురు వస్తువులు మైదాన ప్రాంతంలో వెలుగు ద్వారా ప్రజలు కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ ప్రాంతంలోని గిరిజనులకు వెదురు వస్తువులు తయారు చేసే విధంగా అవసరాన్ని బట్టి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రాంతంలో వెదురు పరికరాలు ఎంతమంది తయారు చేస్తున్నది, తయారుచేసిన వస్తువులు మార్కెట్‌కు ఏ విధంగా తరలించుచున్నది ఆయన ఆరా తీశారు. వెదురు ద్వారా గిరిజనులు తయారుచేసిన వస్తువులను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. ఈ పర్యటనలో ప్రాజెక్ట్ అధికారి వెంట వెలుగు ఏపీడి దేగలయ్య, ఎపిఎం జి.కిషోర్, రామరాజు పాల్గొన్నారు.

# ఓన్ సోర్స్ రెవెన్యూ సర్వేపై వర్చువల్ శిక్షణ

– పాల్గొన్న అధికారులు



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఓన్ సోర్స్ రెవెన్యూ గ్రామ పంచాయతీలు అనే అంశంపై ఎపి.ఎస్.ఐ.ఆర్.డి. విజయవాడ వారిచే వర్చువల్ మండల శిక్షణా తరగతులు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ, డిప్యూటి ఎంపిడిఓ జి.వి.శేఖరరెడ్డి, జి.ఎస్.డబ్ల్యూ.ఎస్. అధికారి వై.శ్రీహరి, వాలుతిమ్మా పురం గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.వెంకటేష్, పులిమేరు డిజిటల్ అసిస్టెంట్ పి.వీరమణికంఠ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎన్.ఐశ్వర, వీఆర్వో కొక్కిరి వెంకటేశ్వర్లు తదితరులు హాజరవ్వడం జరిగింది.

# విద్యుత్ పొదుపు భావితరాలకు వెలుగు



**శంఖవరం, మేజర్ న్యూస్ :** ఒక యూనిట్ విద్యుత్ పొదుపు రెండు యూనిట్ల ఉత్పత్తితో సమానం. ప్రతి ఒక్కరూ ఇంధనం పొదుపు చేసి.. భావితరాలకు వెలుగుని ద్దామ'ని ఎలక్ట్రికల్ ఏఈ జె.గంగమ్మ అన్నారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్ నందు ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా విద్యుత్తు పొదుపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు విద్యుత్ పొదుపు వలన కలిగే లాభాలపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ ఏఈ గంగమ్మ మాట్లాడుతూ 'విద్యుత్ పొదుపు మనందరి సామాజిక బాధ్యత. విద్యుత్‌ను ఆదా చేస్తే.. విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లే. సంప్రదాయేతర ఇంధన వనరులు వినియోగిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం' అని పిలుపునిచ్చారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20 వరకు ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తాం. విద్యుత్ వినియోగం పెరుగుతోంది. భవిష్యత్ అవసరాలు దృష్ట్యా విద్యుత్‌ను ఆదా చేయాలి అని, సౌర విద్యుత్ వినియోగంతో కాలుష్య నివారణ సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఏ.వీర్రాజు, ఎలక్ట్రికల్ జేఈ బి.కుమార్, లైన్‌మేన్ పి.సత్యనారాయణ, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డ్రోన్ నిఘాలో జిల్లా













**– ఆకతాయిల ఆటకట్టేందుకు జిల్లా ఎస్.పి ప్రత్యేక శ్రద్ధ**

**ఉమ్మడి గోదావరి జిల్లాలో సూర్య బ్యూరో :** జిల్లాలో మహిళల భద్రతే పరమావధిగా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్ శాఖ ఆధునిక సాంకేతికతను ఆయుధంగా మలుచుకుంది. జిల్లా ఎస్.పి బిందు మాధవ్ ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు, జిల్లా వ్యాప్తంగా 13 అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో నిఘాను ముమ్మరం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారు, ఈవ్ టీజింగ్‌కు పాల్పడే ఆకతాయిలు, అసాంఘిక వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచుతున్నారు.

కీలక ప్రాంతాల్లో 'కంటిపాప'లా డ్రోన్ నిఘాజిల్లాలోని ప్రధాన కూడళ్లు, విద్యా సంస్థల పరిసరాలు మరియు సమస్యాత్మక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఈ డ్రోన్ ఆపరేషన్ సాగుతోంది.

విద్యా సంస్థలు : పెద్దాపురం ఎం.ఆర్. కాలేజ్ గ్రౌండ్స్, లక్ష్మీనారాయణ నగర్ నారాయణ & శ్రీ చైతన్య స్కూల్స్, ఆదిత్య స్కూల్ జోన్, శాంతినగర్ చైతన్య జూనియర్ కాలేజ్, ఆదిత్య మహిళా డిగ్రీ కాలేజ్, పి.ఆర్. కాలేజ్ గ్రౌండ్స్, తుని వివేక జూనియర్ కాలేజ్, సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కాలేజ్ పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

ప్రజా రవాణా కూడళ్లు : కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్, పెద్దాపురం ఆర్టీసీ కాంప్లెక్స్, అన్నవరం ఆర్టీసీ కాంప్లెక్స్, సర్పవరం జంక్షన్, పద్మప్రియ & భానుగుడి జంక్షన్లు, ఉప్పాడ బస్టాండ్ సెంటర్ వంటి రద్దీ ప్రాంతాలను డ్రోన్లు జల్లెడ పడుతున్నాయి.

సమస్యాత్మక ప్రాంతాలు : మహాలక్ష్మీ నగర్, సంజయ్ నగర్, రమణయ్యపేట ఇండస్ట్రియల్ ఏరియా, తూరంగి శివార్లు, కిరణ్ ఐ హాస్పిటల్ వెనుక ప్రాంతం, పెనుగుదురు బ్రిడ్జి మరియు ఇతర ఐసోలేటెడ్ ప్రాంతాలపై పోలీసులు డేగ కన్ను వేశారు. మహిళల భద్రతే ప్రథమ ప్రాధాన్యతగా మహిళలు, విద్యార్థినులు నిర్భయంగా బయటకు వచ్చే వాతావరణాన్ని కల్పించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని పోలీస్ అధికారులు వెల్లడించారు. బహిరంగ ప్రదేశాల్లో అసభ్యంగా ప్రవర్తించే వారిని, డ్రంక్ అండ్ డ్రైవ్ బాధితులను డ్రోన్ దృశ్యాల ఆధారంగా గుర్తించి తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. "సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా నేరస్తుల ఆటకట్టించడమే కాకుండా, ప్రజల్లో ముఖ్యంగా మహిళల్లో భద్రతా భావాన్ని పెంచడమే మా లక్ష్యం." అని జిల్లా పోలీస్ యంత్రాంగం తెలిపింది. ఈ డ్రోన్ నిఘా నిరంతరం కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించేవారిపై చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా పోలీస్ కార్యాలయం స్పష్టం చేసింది.

# సమస్యలు పరిష్కరించాలని ఐటీడీఏలో ధర్నా

**– పీవోకు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు వినతి**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు నినాదాలు చేస్తూ సిఐటియు కార్యాలయం నుండి ఐటీడీఏ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం ఐటీడీఏ పీవో కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. దీనిపై పిఓ సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.శాంతి రాజు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గత 19 సంవత్సరముల నుండి ఫీల్డ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉపాధి కూలీలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ గ్రామపంచాయతీ స్థాయిలో సుస్థిర శాశ్వత వనరులు ఏర్పాటు, గ్రామాల అభివృద్ధికి తోడ్పడుతున్నారన్నారు. ఉపాధి హామీ పథకం దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ను మొదటి స్థానంలో నిలబెట్టడంలో ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి ఎంతో కీలకమైనదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇస్తున్న వేతనం నెలకు రూ.5,745లతో కుటుంబాలు బ్రతకడం కష్టంగా మారిందని, వారి కుటుంబాలను పస్తులు నుండి కాపాడేందుకు కనీస వేతనంగా 26,000 చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమ సమస్యలు తీరుతాయని ఫీల్డ్ అసిస్టెంట్లు భావించినప్పటికీ గత ప్రభుత్వంలో జరిగినట్లే గత ఏడాది కాలంలో ఫీల్డ్ అసిస్టెంట్లు అక్రమ తొలగింపులు పెద్ద ఎత్తున జరిగాయన్నారు. ఇలాంటి ఒత్తిడి వలన ఫీల్డ్ అసిస్టెంట్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, హత్యలకు గురవుతున్నారని అనేక చోట్ల బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారని, దీనితో ఫీల్డ్ అసిస్టెంట్లు నిత్యం అభద్రతతో బ్రతుకులీడుస్తున్నారన్నారు. కాబట్టి ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు అరికట్టి ఉద్యోగ భద్రత కల్పించాలని, వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు అంగవైకల్యం పొందినా, మరణించినా వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా రూ.25 లక్షలు ఇవ్వాలని, కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, అర్హత అనుభవం కలిగిన ఫీల్డ్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించాలని, కూలీలకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ లు యూనియన్ నాయకులు మడి శ్రీనుబాబు దొర, కారం రామకృష్ణ, పత్రి వెంకటగిరి, సారపు బాపన దొర, కె.సత్తిబాబు, వి.మోహన్ రెడ్డి, కారం శాంత కుమారి, కత్తుల సోమిరెడ్డి, కత్తుల మంగిరెడ్డి, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## రామచంద్రపురం ప్రజల ఆకాంక్షను చాటిన పోలిశెట్టి చంద్రశేఖర్

**– జేఏసీ ఘన సన్మానం**

**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లా కేంద్ర పరిధిలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ రాసిన బహిరంగ లేఖపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల చిరకాల వాంఛను ప్రతిబింబిస్తూ ఆయన గళం ఎత్తినందుకు శుక్రవారం రామచంద్రపురం అఖిలపక్ష జేఏసీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ మాగాపు అమ్మి రాజు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ.. భౌగోళికంగా, పరిపాలనా పరంగా రామచంద్రపురం ప్రజలకు కాకినాడనే అత్యంత అనుకూలమని పేర్కొన్నారు. అమలాపురం జిల్లా కేంద్రంగా మారడం వల్ల ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులను మంత్రి వాసంశెట్టి సుభాష్ దృష్టికి తీసుకెళ్లడంలో చంద్రశేఖర్ చూపిన చొరవ అభినందనీయమన్నారు. సన్మాన గ్రహీత పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా ఏ నిర్ణయం ఉన్నా జనసేన పార్టీ ఊరుకోదని, కాకినాడ జిల్లా కేంద్ర సాధన కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సిద్ధూ మరియు వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నిండు జీవితానికి రెండు చుక్కలు..

**– ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** ఈ నెల 21వ తేది ఆదివారం నిర్వహించబోవు పోలియో చుక్కల కార్యక్రమం పురస్కరించుకుని, శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం పిహెచ్‌సి వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ తెలుపుతూ ఐదు సంవత్సరాల లోపు గల చిన్నారులందరికి పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని, మండ లంలో పులిమేరు, కాండ్రకోట, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గల గ్రామాలలో ఈ పల్స్‌పోలియో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఈరంకి ప్రభాకర శర్మ, వైద్యులు డా.చంద్రకిరణ్‌బాబు, డా.శ్రావణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మరిడమ్మ అమ్మవార్కి బంగారు, వెండి పుష్పాలతో పుష్పార్చన



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో వేదపండితులు మరిడమ్మ అమ్మవారిని బంగారు పుష్పాలు, వెండి పుష్పాలతో ఆసాదులు, వేదపారాయణదారులు, పూజ, అర్చన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పులిహోర ప్రసాద వితరణ చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, క్రాంతివీర్, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కందుల దుర్గేష్ కృషితో నిడదవోలుకు రూ.2.60 కోట్ల పుష్కర నిధులు మంజూరు

**– గోదావరి పుష్కరాల నాటికి ఆలయాలను అభివృద్ధి చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి**




**నిడదవోలు, మేజర్ న్యూస్ :** మంత్రి కందుల దుర్గేష్ కృషితో నిడదవోలు నియోజకవర్గంలోని రెండు దేవాలయాల అభివృద్ధికి రూ.2.60 కోట్ల గోదావరి పుష్కర నిధులు మంజూరు అయ్యాయి. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే గోదావరి పుష్కర వేడుకకు తగినట్లుగా ఆలయాలను తీర్చిదిద్దేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించగా నిడదవోలు నియోజకవర్గంలో గోదావరి తీరానికి సమీపంలో ఉండి నిర్వహణ, పునరుద్ధరణ, ఆధునికీకరణ అవసరమైన దేవాలయాలను, సత్రాలను గుర్తించి మంత్రి దుర్గేష్ చొరవతో పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం అంగీకరించింది. ఈ క్రమంలో పెరవలి మండలం అన్నవరప్పాడు గ్రామంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి రూ.2 కోట్లు, నిడదవోలు మండలం గోపవరం గ్రామంలోని శ్రీ గుబ్బాలమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి, ముఖమండపం ఏర్పాటుకు రూ.60 లక్షలు మంజూరు చేసేందుకు పరిపాలన అనుమతులు వెలువడ్డాయి. త్వరలోనే ఈ ఆలయాలు కొత్త శోభ సంతరించుకుంటాయని, భక్తులకు మరిన్ని వసతులు అందుబాటులోకి వస్తాయని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. పుష్కరాల నిర్వహణపై ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నామని, అదే సమయంలో ఆలయాల పురోగతిని పరిశీలిస్తున్నామన్నారు. అదే విధంగా అఖండ గోదావరిలో నిడదవోలును అంతర్భాగం చేసి పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2027 జూన్ 26 నుండి జులై 7 వరకు 12 రోజుల పాటు జరిగే గోదావరి పుష్కరాలను అత్యద్భుతంగా నిర్వహిస్తామని మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిడదవోలు నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రి కందుల దుర్గేష్ చేసిన ప్రయత్నాలు ఒక్కొక్కటిగా సత్ఫలితాలిస్తుండటం శుభ పరిణామం.

# లక్ష్మీపురం పంచాయతీలో అంగన్వాడి భవనం మరియు పంచాయితీ భవనాన్ని నిర్మించాలి

**– ఎమ్మెల్యే ప్రజా దర్బారులో వినతి పత్రం అందించిన కణితి మధు, ఉండేటి రమేష్**



**ఎటపాక,మేజర్‌న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం పంచాయతీలు నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కారం కొరకు శుక్రవారం రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష భాస్కర్ రంపచోడవరంలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్‌లో వినతి పత్రాన్ని టీడీపీ నాయకులు కణితి మధు, ఉండేడి రమేష్ అందించడం జరిగింది. ఈ సందర్భంగా రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవికి కణితి మధు, రమేష్ మండలంలో వున్న సమస్య లను తెలియజేస్తూ లక్ష్మీపురం పంచాయతీలో మాధవరావుపేట, పట్టుచీర గ్రామంలో అంగన్వాడి పక్క భవనం లేక, అంగన్వాడి బడి పిల్లలు చాలా కాలం నుంచి ఇబ్బందులు పడుతున్నారని మరియు లక్ష్మీపురంలో పంచాయతీ భవనం రెండు పంచాయతీల ప్రజలకు సచివాలయ కార్యాలయానికి వచ్చే ప్రజలకు గతంలో ఏర్పాటు చేసిన పంచాయతీ భవనం సరిపోవటం లేదని, నూతన పంచాయతీ భవనం నిర్మించాలని తెలియజేసారు. వోల్టేజ్ సమస్యతో ఇబ్బంది పడుతున్న బూరుగువాయి మరియు తుని గుట్ట గ్రామాలకు నూతన డిటిఆర్ మంజూరు చేయించాలని ప్రజా దర్బారులో తెలియజేసారు. వివిధ సమస్యల మీద ఇచ్చినటువంటి అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించి ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే శిరీష దేవికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ లక్ష్మీపురం పంచాయతీనాయకులు పాల్గొన్నారు.

# కొండపోడు భూసమస్యలపై ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** గిరిజనులు సాగు చేసుకుంటున్న కొండపోడు భూముల పట్టాల పంపిణీలో దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను అభివృద్ధి చేసేందుకు అధికారులు శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏలేశ్వరం, రాజవొమ్మంగి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో ఉన్న ఏలేశ్వరం మండలానికి చెందిన మర్రివీడు, జె. అన్నవరం, తూర్పు లక్ష్మీపురం గ్రామాల గిరిజనులు, రాజవొమ్మంగి పరిధిలో ఉన్న మెట్టు చింత, బాపన్న తదితర గ్రామాల గిరిజనులు ఎదుర్కొంటున్న ఆర్.ఓ.ఎఫ్.ఆర్.డిపట్టాల సమస్యలపై నిర్వహించిన ప్రజా దర్బారు కు కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభమ్ నొక్వాల్ , ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ , పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి పాల్గొని గిరిజనులు ఎదుర్కొంటున్న కొండపోడు పట్టాల పంపిణీ సమస్యలను, రికార్డులను క్షుణంగా పరిశీలించారు. అనంతరం ప్రజాదర్బార్ లో పాల్గొన్న గిరిజనుల సమస్యలు చెప్పమని అధికారులు కోరారు. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములకు సంబంధించి తమకు ఆర్.ఓ.ఎఫ్.ఆర్ , డి పట్టాలు మంజూరు చేయాలని గిరిజనులు అధికారులను కోరారు. భూములపై హక్కులు ఉన్నప్పటికీ పట్టాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అధికారులకు, ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ, గిరిజనుల సమస్యలను సాధ్యాసాధ్యాల మేరకు సమగ్రంగా పరిశీలించి, అర్హులైన వారికి న్యాయం జరిగేలా పట్టాలు మంజూరు చేయాలని అధికారులను కోరారు. కొండపోడు భూములపై సమగ్ర విచారణలు నిర్వహించి అర్హత ఉన్న గిరిజనులకు ఆర్.ఓ.ఎఫ్.ఆర్ , డి పట్టాలు మంజూరు చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. కాగా ఏలేరు రిజర్వాయర్ నిర్మాణం తర్వాత ఒంపులకు గురైన గ్రామాలకు చెందిన గిరిజనులు, ఎస్సీ, బీసీ, రైతు కూలీలు మర్రివీడు, జె అన్నవరం, పరిమితడక ప్రాంతాల్లో ఉంటున్నామని, మూడు దశాబ్దాలుగా ఇదే ప్రాంతంలో ఉన్న అటవీ ప్రాంతాల్లో కొండపోడులలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దశాబ్దాలుగా కొండపోడు భూముల హక్కుదారుల గుర్తింపులో రాజకీయం చోటు చేసుకుంటుందని ఆరోపించారు. నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతుందని సభాముఖంగా పలువురు గిరిజనులు, ఏలేరు నిర్వాసితులు కన్నీటి పర్యాంతమై ఆవేదన చెందారు. ఇకనైనా రాజకీయాలను పక్కనపెట్టి నిజమైన లబ్ధిదారులు గుర్తించి తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను వేడుకున్నారు. అలాగే మర్రి వీడు ప్రాంతంలో గల పల్లె పాకలు గ్రామంలో 152 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని వీరి పిల్లలు సుమారు 120 మంది మర్రివీడు పాఠశాలలో చదువుకుంటున్నారు అని, వర్షాకాలంలో వీరందరినీ పడవలపై స్కూళ్లకు తీసుకెళ్లడం ప్రమాదంగా ఉందన్నారు. అయితే ఫారెస్ట్ కొండ దిగువ ప్రాంతం నుండి రహదారి నిర్మాణానికి ఫారెస్ట్ అధికారులు అనుమతి ఇచ్చేలా చూడాలని, దానికి బదులుగా వారికి తమ గ్రామంలో గల భూములను ఫారెస్ట్ పెంచడానికి అధికారులకు ఇస్తామని గ్రామ ఎక్స్ సర్పంచ్ చింతలపాటి బుజ్జి రాజు , పాస్టర్ జాకోబ్ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఆయా ప్రాంతాల ప్రజలు, నాయకులు తరలివచ్చారు.

## ఉపాధి చట్టాన్ని పథకంగా మార్చడం దారుణం



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** గ్రామీణ ప్రాంతాలలో పేదలకు ఎంతో కొంత ఉపయోగపడుతున్న ఉపాధి హామీ చట్టాన్ని స్కీమ్ మార్చడం విరమించుకోవాలని, పెద్దాపురం మండల సిపిఎం కమిటి డిమాండ్ చేసింది. మహాత్మాగాంధి పేరుతో ఉన్న ఉపాధి హామీని రామ్ జీ ఉపాధి స్కీమ్‌గా మార్పు చేస్తూ పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నా, దానిని అమలు చేయడానికి తీర్మానించడం దారుణమన్నారు. ఇప్పటివరకు చట్టంలో 90శాతం నిధులు కేంద్రం ఇస్తే, రాష్ట్రం 10 శాతం ఇవ్వాలసి ఉండేదని, దానిని రాష్ట్రం నుండి 40శాతం ఇవ్వాలని చెప్పడం అంటే ఉపాధి చట్టాన్ని పూర్తిగా నాశనం చేయడమేనని అన్నారు. రాజకీయం కోసం రాజకీయ ప్రయోజనాల కోసమే వీరు ప్రయత్నం చేస్తున్నారని, ఉపాధి హామీ చట్టాన్ని ఏడాదికి 200 రోజులు కల్పించాలని, పట్టణ ప్రాంతాలకు విస్తరించాలని, రాష్ట్రాలు, కేంద్రాలపై ఒత్తిడి తేవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిరపురపు శ్రీనివాస్, కేదారి నాగు, సుబ్బలక్ష్మీ, వీర్రాజు, నరసింహమూర్తి, సత్యనారాయణ, గడిగట్ల సత్తిబాబు, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో చేస్తున్న క్లీన్ పెరవలికు సహకరించండి



**పెరవలి, మేజర్ న్యూస్ :** పెరవలి ఆర్యవైశ్య సేవా సంఘం మరియు స్వచ్ఛ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో క్లీన్ పెరవలి గ్రీన్ పెరవలి కార్యక్రమం నిర్వహిస్తున్నామని స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్రలో భాగంగా పెరవలి ఉత్తమ గ్రామంగా నిలపాలని ఉద్దేశంతో పెరవలి గ్రామంలో ప్లాస్టిక్ సంచుల నిరోధానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో పవన్ కళ్యాణ్ మంత్రి కందుల దుర్గేష్ ఫోటోలతో కూడిన చేతి సంచులు పంపిణీ చేస్తున్న విధానాన్ని డిసెంబర్ 19వ తేదీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సభ ఏర్పాటు పరిశీలించడానికి పెరవలి గ్రామానికి వచ్చిన ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ కమిషనర్ ఎం కృష్ణ తేజకి పెరవలి ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి గుడివాడ బాలకృష్ణ, వశిష్ట వినియోదారుల సంఘం అధ్యక్షుడు సలాది ఉదయ భాస్కరరావులు వివరించారు. ఈ సందర్భంగా పెరవలి గ్రామానికి చెత్త రవాణా కు వాహనాన్ని, గ్రామానికి డంపింగ్ యార్డ్‌ను సమకూర్చాలని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజకి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పుబల సదాశివ గోపి గుడివాడ సోమేశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సీ పోర్ట్ క్షేత్రస్థాయి పర్యటనలో... హార్వెస్ట్ విద్యార్థులు



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం స్థానిక హార్వెస్ట్ ది కాన్సెప్ట్ స్కూల్‌లో 6 నుండి 9 తరగతి విద్యార్థులను శుక్రవారం కాకినాడ సి పోర్టు క్షేత్ర పర్యటనకు తీసుకునివెళ్ళినట్టు కరస్పాండెంట్లు సత్యానంద రెడ్డి, సత్య మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీల్డ్ ట్రిప్పులో వివిధ రకాలైన యంత్రాలు వాటి పనితీరు, ఓడల ద్వారా జరిగే వివిధ రకాలైన వస్తువులు, ఎరువులు, ముడిసరుకలు, ఎగుమతులు, దిగుమతులు కోసం సీ పోర్ట్ చరిత్ర మొదలైన అంశాలను స్వయంగా పరిశీలించి అవగాహన చేసుకున్నారన్నారు.

అనంతరం కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఎయిర్పోర్ట్ మ్యూజియంను సందర్శించారన్నారు. ఈ క్షేత్ర పర్యటన విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనీల్ రవీంద్ర, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.కోటి నిధులతో నిర్మించిన చేపల మార్కెట్ షెడ్డు ప్రారంభం





**– పాల్గొన్న జిల్లా కలెక్టర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే తదితరులు**

**తాళ్ళరేవు, మేజర్ న్యూస్ :** జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో తాళ్ళరేవు మండలం జి.వేమవరం గ్రామపంచాయతీ పరిధిలోని మట్లపాలెం వద్ద రూ.కోటి నిధులతో నిర్మించిన చేపల మార్కెట్ షెడ్డు (ఫిష్ ల్యాండింగ్ సెంటర్) ను శుక్రవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బారాజు, మాజీమంత్రి రామచంద్రరావు, ఇతర ప్రజాప్రతినిధులు కలిసి రిబ్బన్ కట్ చేసి లాంచనంగా ప్రారంభించారు. అనంతరం దీనికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ.. క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి వంటి పండుగలు జరుపుకోనున్న శుభ తరుణంలో 14 గ్రామాల ప్రజలు ఉపయోగపడే మంచి పనిని ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.తాళ్ళరేవు మండలం, మట్లపాలెం నందు ఫిష్ లాండింగ్ సెంటర్ నిర్మాణం కొరకు 2018లో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద మత్స్య శాఖ ద్వారా కోటి రూపాయలు మంజూరు చేసినప్పటికీ వివిధ కారణాలతో ఇప్పటివరకు పనులు పూర్తి కాలేదన్నారు. ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు దాట్ల సుబ్బారాజు ప్రత్యేక చొరవతో పనులు ప్రారంభించి నిర్మాణ పనులు పూర్తి చేసుకుని మత్స్యకారులు అవసరాలకు అనుగుణంగా రెండు విశాలమైన ఆక్షన్ హాల్, చాపలు అమ్మకం హాలులను అందుబాటులోకి తీసుకురావడం శుభ పరిణామం అని అన్నారు. ఈ చేపల మార్కెట్ షెడ్డు చుట్టుపక్కల లెవెలింగ్, రోడ్డు, కాంపౌండ్ వాల్ ఇతర పనులు చేపట్టాల్సి ఉందన్నారు. కోల్డ్ స్టోరేజ్ సౌకర్యాలను పీఎంఎంఎస్వై పథకం కింద ఏర్పాటు చేయుటకు ఫిషరీస్ డిపార్ట్మెంట్తో చర్చించి సాధ్యాసాధ్యాలను పరిశీలించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బారాజు మాట్లాడుతూ 2014–19 తెలుగుదేశం ప్రభుత్వం హాయంలో ఈ చేపల మార్కెట్కు శంకుస్థాపన చేయడం జరిగిందని.. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాలలో దీన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే నిర్మాణ పనులు ప్రారంభించుకుని నేడు మత్స్యకారులకు వినియోగంలోకి తీసుకురావడం జరిగిందని ఆయన తెలిపారు. మట్లపాలెం చాపల మార్కెట్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బాగా ప్రసిద్ధి చెందినదని ఈ ఫిష్ లాండింగ్ సెంటర్ ద్వారా 14 గ్రామాలకు చెందిన 250 బోట్లు మీద వేట సాగించి ఇక్కడ అమ్ముకాలు సాగిస్తుంటారన్నారు. 1500 మంది వ్యాపారస్తులు నిత్యం ఈ చేపల మార్కెట్ కార్యకలాపాల్లో పాల్గొని 35 నుంచి 50 లక్షల రూపాయలు వ్యాపారం సాగిస్తూ ఉంటారని ఆయన తెలిపారు. ఇక్కడ కాంపౌండ్ వాల్, షెడ్లు, కోల్డ్ స్టోరేజ్ ఇతర సదుపాయాలు కల్పిస్తే మత్స్యకారులు మరింత సౌకర్యవంతంగా వ్యాపారం సాగించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ మార్కెట్ కు అవసరమైన ల్యాండ్ ఫిల్లింగ్,అప్రోచ్ రోడ్ మరియు బోట్లు కట్టుకొనుటకు అవసరమైన జెట్టీలను నిర్మిస్తామన్నారు.మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ.. మట్లపాలెంలో చాలా ఏళ్లుగా మత్స్యకారులు తమ ఉత్పత్తులను రోడ్డు మీదే అమ్ముకునేవారని, కూటమి ప్రభుత్వం చొరవతో చేపల మార్కెట్ భవనాలు నిర్మించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. మట్లపాలెం చేపల మార్కెట్లో ఆక్వా ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని, ఈ మార్కెట్ కు ఎక్కువ వాహనాలు వెళ్లి వచ్చేందుకు అప్రోచ్ రోడ్డు నిర్మాణం, కోల్డ్ స్టోరేజ్ సదుపాయా కల్పనపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. జిల్లా మత్స్యశాఖ డీడీ కృష్ణారావు మాట్లాడుతూ.. చిన్న చిన్న గ్రామాలు, వీధులలో చేపలు రొయ్యలు అమ్ముకునే మత్స్యకార మహిళలు ఇక్కడినుంచే కొనుగోలు చేస్తారన్నారు.

ఇక్కడ చెరువులో పండించే వనామి రొయ్యలు, చెరువు చేపలు, పీతలు, ఎండు చేపలు, ఎండి రొయ్యలు, సముద్రపు చేపలు, ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేస్తారని ఆయన తెలిపారు. ఈ ఫిష్ లాండింగ్ సెంటర్ కేవలం చేపల వ్యాపారస్తులే కుండా పెళ్లిళ్లు ఇతర శుభకార్యక్రమాలకు ఎక్కువ మొత్తంలో చేపలు, రొయ్యలు అమ్మకాలు జరుగుతాయన్నారు. ఈ చేపల మార్కెట్లో 20 శాతం సముద్ర ఉత్పత్తులు, 80 శాతం చెరువు చేపలు, రొయ్యలు లభ్యమవుతాయని, ప్రభుత్వం కల్పించిన ఈ సదుపాయాన్ని మత్స్యకారులు సక్రమంగా వినియోగించుకోవాలని ఆయన కోరారు.అనంతరం పటవల గ్రామం నుంచి శాంతమూల గ్రామానికి పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.1.73 కోట్లతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బారాజు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో తాళ్లరేవు ఎంపీపీ రాయుడు సునీత, జీ.వేమవరం సర్పంచ్ పుణ్యాత్ములు సూరిబాబు, పంచాయతీరాజ్ ఎస్ఈ ఏవీఎస్. శ్రీనివాసు, ఇరిగేషన్ ఈఈ ఎంవీవీ.కిషోర్, తాళ్ళరేవు తహసీల్దార్ పి.త్రినాధరావు, తాళ్ళరేవు మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఎం.లావణ్య, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి వి.అనురాధ దేవి, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అంకితభావంతో పనిచేస్తున్న ఉపసర్పంచ్ మారుతి

**– ఎమ్మెల్యే బండారు సహకారంతో సమస్యలు పరిష్కారం**



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** భారతీయ ప్రజా స్వామ్యంలో అత్యంత బలమైన పునాది గ్రామం. ఆ గ్రామం బలపడితేనే దేశం బలపడుతుంది.కొత్తపేట గ్రామానికి చెందిన వీళ్ల మారుతి ఉప సర్పంచ్గా బాధ్యతలు చేపట్టిన దగ్గర నుండి అహర్నిశలు గ్రామ అభివృద్ధికి పాటు పడుతున్నారు. నిన్న సమస్యగా ఉన్న స్వయంగా ఆయనే దగ్గర ఉండి వాటిని నేడు పరిష్కారం దిశగా తీసుకెళ్తున్నాడు. అటు అధికారులను,ఇటు రాజకీయ నాయకులను సమన్వయం చేసుకుంటూ అభివృద్దే లక్ష్యంగా చేసుకుని ముందుకు దూసుకుపోతున్నాడు. ఆయన ఒక వార్డు మెంబెర్ గా గెలుపొందిన ఆయన ఉప సర్పంచ్ గా ఉంటూ పనితీరులో ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారు. తెదేపా పార్టీకి వీర విధేయుడుగా, ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు నమ్మిన బంటుగా ఉన్నారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా అక్కడ ఉప సర్పంచ్ మారుతి ఉంటాడని చెరగని ముద్ర వేసుకున్నాడు. పారిశుద్ధ్య, నీటి, డ్రైన్స్, రోడ్లు మొదలగు సమస్యలను ఎమ్మెల్యే సహకారంతో త్వరగతిన పరిష్కరించి ప్రజల మన్ననలను పొందుతున్నారు. గ్రామ స్థాయిపదవిలో ఉండి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఈయన పనితీరును చూసిన ప్రజలు మరింతగా సేవలందించే పదవులు వరించాలని గ్రామ ప్రజలు ఆకాంకిస్తున్నారు.

## విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఇంధన పొదుపు వారోత్సవాలు



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఇంధనాన్ని పొదుపు చేయడం ద్వారా భావితరాలకు మంచి భవిష్యత్తును అందించగలమని విద్యుత్ శాఖ ఏఈ సూర్యనారాయణ అన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు జరిగే ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఏలేశ్వరం మండల విద్యుత్ శాఖ అధికారులు స్థానిక జడ్పీ బాలికొన్నత పాఠశాలలో విద్యుత్ పొదుపు వారోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థినిలకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలను విద్యుత్తు పొదుపుపై నిర్వహించి వారిలో విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ మండల ఏఈ గోదావరి సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచి ఇంధన పొదుపు పోయే అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఇంధనం పొదుపు చేయడం ద్వారా భావితరాలకు మంచి భవిష్యత్తును అందించవచ్చు అన్నారు. అలాగే పర్యావరణ సమతుల్యతకు ఇంధన పొదుపు ఎంతగానో ఉపకరిస్తుందని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జేఈ శివకోటి లోవరాజు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## కల్వకుంట్ల కవితను మర్యాద పూర్వకంగా కలిసిన ఆటో యూనియన్ అధ్యక్షులు



**ఎటపాక, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలో గల ఐదు గ్రామ పంచాయతీ లను తెలంగాణ రాష్ట్రంలో విలీనం చేయాలని తెలంగాణ జాగృతి పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం జనం బాట కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్రం భద్రాచలం కె.కె.పంక్షన్ హల్ నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆటో యూనియన్ జెఏసి అధ్యక్షులు మర్మం శంకర్ హాజరు అయి జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో కలపాలి అని, రాష్ట్రం విడిపోయిన అనంతరం ముంపు మండలాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారు అని, ముఖ్యంగా గుండాల, పురుషోత్త పట్నం, ఎటపాక, పిచ్చు కలపాడు, కన్నాయిగూడెం గ్రామ పంచాయతీ ప్రజలు నష్టపోయారు అని ఆయన అన్నారు. జిల్లా కేంద్రానికి వెళ్ళాలి అంటే సుమారు 250 కిలోమీటర్లు ప్రయాణం చేయవలసి వచ్చేది అని, అదే ఈ ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణ రాష్ట్రంలో ఉండి ఉంటే జిల్లా కేంద్రం చాలా తక్కువ దూరంలో ఉండేది అని, ఈ ఐదు గ్రామ పంచాయతీ ప్రజలకు తెలంగాణ రాష్ట్రం భద్రాచలంతో అనుబంధం వుంది అని, ఆయన ఆమెకు వివరించారు. కల్వకుంట్ల కవిత వెంటనే స్పందించిన ఐదు గ్రామ పంచా యతీలను తెలంగాణ రాష్ట్రంలో కలిపే వరకు మా పోరాటం ఆగదు ఆమె తెలిపారు. తెలంగాణ జాగృతి పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు ఆయన ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

## నేడు తూర్పుగోదావరి జిల్లాకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**పెరవలి, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ నేడు తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్నారనీ , పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర పర్యటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియ చేశారు. నిడదవోలు నియోజకవర్గంలోని పెరవలి గ్రామంలో నిర్వహించనున్న అమరజీవి జలధార కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఉదయం 9.20 గంటలకు మంగళగిరి క్యాంప్ కార్యాలయం నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి, ఉదయం 10 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ఉదయం 10.10 గంటలకు హెలికాప్టర్ ద్వారా నిడదవోలు నియోజకవర్గం పెరవలి గ్రామ హెలిప్యాడ్కు బయలుదేరి, ఉదయం 10.50 గంటలకు అక్కడికి చేరుకుంటారు. ఉదయం 10.55 గంటలకు హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గంలో అమరజీవి జలధారా కార్యక్రమ వేదికకు చేరుకొని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం 1 గంటకు వేదిక నుంచి బయలుదేరి, 1.05 గంటలకు పెరవలి హెలిప్యాడ్కు చేరుకుంటారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 1.10 గంటలకు హెలికాప్టర్ ద్వారా గన్నవరం విమానాశ్రయానికి బయలుదేరి, 1.50 గంటలకు అక్కడికి చేరుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి మంగళగిరి క్యాంప్ కార్యాలయానికి రోడ్డు మార్గంలో బయలుదేరి, 2.40 గంటలకు చేరుకుంటారు.

# సమస్యల పరిష్కారానికి వేదికగా ‘ప్రజా దర్బార్’

**– బాధితులతో ముఖాముఖి..**
**అక్కడికక్కడే అధికారులకు ఎమ్మెల్యే కొండబాబు ఆదేశాలు**
**– ప్రజా దర్బార్ కేవలం అర్జీల వేదిక కాదు..**
**పరిష్కార కేంద్రం : వనమాడి కొండబాబు**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు తక్షణ పరిష్కారం చూపి, వారికి భరోసా కల్పించడమే ధ్యేయంగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) జగన్నాధపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ‘ప్రజా దర్బార్’ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి ఆయన స్వయంగా అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడారు. సమస్యలపై తక్షణ స్పందనని ఈ ప్రజా దర్బార్‌కు విచ్చేసిన ప్రజలు ఇళ్ల స్థలాలు మరియు గృహ నిర్మాణ అనుమతులు, నూతన పెన్షన్ల మంజూరులో జాప్యం, పౌర సంబంధిత మరియు మౌలిక సదుపాయాల సమస్యలపై ప్రధానంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే, వెంటనే రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**జాప్యం వహిస్తే సహించేది లేదు : ఎమ్మెల్యే హెచ్చరిక..**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ, ప్రభుత్వ ఫలాలు సామాన్యులకు సకాలంలో అందాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. “ప్రజా దర్బార్ అనేది కేవలం కాగితాలు తీసుకునే వేదిక కాదు, ఇది సమస్యల పరిష్కారానికి భరోసా ఇచ్చే కేంద్రం. చట్టపరిధిలో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరించి బాధితులకు న్యాయం చేసేందుకు నిరంతరం కృషి చేస్తాను” అని ఆయన హామీ ఇచ్చారు.

**హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు**

ఎమ్మెల్యే కొండబాబు నేరుగా తమ వద్దకు వచ్చి, సమస్యలను సావధానంగా వినడమే కాకుండా.. అక్కడికక్కడే పరిష్కార మార్గాలను చూపడం పట్ల అర్జీదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.కార్యక్రమంలో కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు మరియు జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డుపై భవన నిర్మాణ వ్యర్థాలు వేయొద్దు

**– నగర ప్రజలకు కాకినాడ నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ సత్యనారాయణ విజ్ఞప్తి**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ నగరంలో భవన నిర్మాణానికి సంబంధించిన వ్యర్థాలను రోడ్లపై వేయవద్దని నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ నగర ప్రజలను కోరారు. శుక్రవారం ఉదయం నగరంలో సుబ్బయ్య హోటల్ ప్రాంతం, రామారావుపేట ప్రాంతాల్లో పర్యటించిన ఆయన అక్కడ జరుగుతున్న పారిశుధ్య, నిర్వహణ పనులను పరిశీలించారు. పర్యటన సందర్భంగా రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలు పడివున్నట్లు గమనించిన ఇంచార్జ్ కమిషనర్, సంబంధిత భవన యాజమాన్యాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య కార్మికులు ఎంత శుభ్రం చేసినప్పటికీ, నిర్మాణ వ్యర్థాలను రోడ్లపై వేయడం వల్ల రహదారులు మళ్లీ వ్యర్థాలతో నిండిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ వ్యర్థాలు ఉన్నట్లయితే సచివాలయ సిబ్బందికి సమాచారం అందిస్తే, నగరపాలక సంస్థ సిబ్బంది వచ్చి వాటిని తొలగిస్తారని తెలిపారు. ఇందుకు సంబంధించి కార్పొరేషన్‌కు నిర్ణయించిన చలానా ఫీజు కూడా చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కాకినాడ నగరాన్ని “క్లీన్ అండ్ గ్రీన్ సిటీ”గా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ చేపడుతున్న చర్యలకు ప్రజలు కూడా బాధ్యతగా సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇంచార్జ్ కమిషనర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కే.టి.సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వి చరణ్, వాటర్ వర్క్స్ డీఈ లక్ష్మీనారాయణ, ఏసీపీ శ్రీధర్, ఈఈ ఆదినారాయణ, శానిటేషన్ సూపర్వైజర్ రాంబాబు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సత్తిబాబు తదితర అధికారులు పాల్గొన్నారు.

# రాజమండ్రిలో హోండా ఆధ్వర్యంలోని రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు



**– 2,400 మంది విద్యార్థులకు సురక్షిత ప్రయాణంపై శిక్షణ**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** రోడ్డు భద్రత పట్ల బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించే లక్ష్యంతో హోండా మోటర్‌సైకిల్ స్కూటర్ ఇండియా రాజమహేంద్రవరంలో భారీ అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించింది. నగరంలోని శ్రీ శిఖర ఈ.ఎమ్. స్కూల్ మరియు ఓఎన్‌జీసీ ప్రాంగణంలోని కేంద్రీయ విద్యాలయం విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఈ శిబిరాల్లో సుమారు 2,400 మందికి పైగా విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమ ముఖ్యాంశాలు: ఇంటరాక్టివ్ లెర్నింగ్: కేవలం ఉపన్యాసాలకే పరిమితం కాకుండా, నిజ జీవిత పరిస్థితులను ఉదాహరణలుగా చూపుతూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యమైన అంశాలు: హెల్మెట్ ధరించడం యొక్క ప్రాముఖ్యత, పాదచారుల భద్రత, ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు రోడ్డు చిహ్నాల అర్థాలను వివరించారు. ప్రయోగాత్మక ప్రదర్శనలు: శిక్షణ పొందిన ఇన్‌స్ట్రక్టర్ల ద్వారా రోడ్డుపై ఎదురయ్యే సవాళ్లు మరియు ప్రమాదాలను ఎలా నివారించవచ్చో డెమోల ద్వారా చూపించారు. బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలి: ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వహణ ప్రతినిధులు మాట్లాడుతూ, రోడ్డు భద్రత అనేది కేవలం నియమం మాత్రమే కాదని, అది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు తాము నేర్చుకున్న విషయాలను పాటించడమే కాకుండా, తమ కుటుంబ సభ్యులు మరియు స్నేహితులను కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా ప్రోత్సహించాలని కోరారు. భవిష్యత్తు తరాల్లో సురక్షిత ప్రయాణ సంస్కృతిని పెంపొందించడానికి దేశవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. పాఠశాల యాజమాన్యాలు హోండా సంస్థ చేస్తున్న ఈ కృషిని అభినందించాయి.

# రాజమండ్రిలో కేటీఎం 160 డ్యూక్ టెస్ట్ రైడ్

–కేటీఎం నిపుణుల పర్యవేక్షణలో కేటీఎం 160 డ్యూక్ డ్రైవింగ్



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రపంచంలోనే నంబర్ వన్ ప్రీమియం మోటార్‌సైకిల్‌గా పేరుగాంచిన రేసింగ్ బైక్ బ్రాండ్ అయిన కేటీఎం 160 డ్యూక్ బైక్ టెస్ట్ రైడ్ చేసే అవకాశాన్ని రాజమండ్రి నగర వాసులకు కల్పిస్తున్నట్టు బజాజ్ ఆటో లిమిటెడ్ ప్రొ బైకింగ్ హెడ్ మానిక్ నాంగియా తెలిపారు. ఈ మేరకు తాము తాజాగా రూపొందించిన కెటిఎమ్ ఆరెంజ్ ఎక్స్ పీ - 160ని ను తమ రైడింగ్ నిపుణుల పర్యవేక్షణలో రాజమండ్రిలో ఆసక్తి కలవారు ఎవరైనా ఇది కేటీఎం 160 డ్యూక్ ను నడిపి చూడవచ్చని చెప్పారు. రైడింగ్ ప్రియులు అనుభవించడానికి ప్రత్యేకంగా రూపొందించబడిన, ట్రాక్ ఫస్ట్ అనుభవం. ఈ మోటార్‌సైకిల్‌ను అనుభూతి చెందడానికి ఒక నవ మార్గంగా రూపొందించబడిన ఆరెంజ్ ఎక్స్ పి - 160 కేటీఎం నిపుణుల మార్గదర్శకత్వంలో ఎవరైనా సరే 160 డ్యూక్ బైక్‌ను సరైన ట్రాక్‌పై టెస్ట్ రైడ్ చేయడానికి వీలు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమం పుణెలో నవంబర్ 29, 2025న ప్రారంభమైందని, భారతదేశం అంతటా 40 కి పైగా పట్టణాలకు విస్తరించనుందన్నారు. ఇది మీ నగరానికి రేపు రాజమండ్రి వస్తుంది. ఇది దేశంలో కేటీఎం చేపట్టిన అతిపెద్ద అనుభవపూర్వక కార్యక్రమాలలో ఒకటిగా నిలవనుందన్నారు. ముఖ్య నగరాల్లోని గో కార్ట్ ట్రాక్‌లపై నిర్వహించబడుతున్న ఆరెంజ్ ఎక్స్ పీ -160, కేటీఎం 160 డ్యూక్ తన అత్యుత్తమ పనితీరును కనబరిచే ట్రాక్‌పైనే బైక్‌ను ప్రదర్శిస్తుందన్నారు. ఇది రైడర్‌లకు సురక్షితమైన, నియంత్రిత మరియు లీనమయ్యే ‘రైడ్ & లెర్న్’ వాతావరణాన్ని అందిస్తుందని, సాధారణ రోడ్లపై ఎన్నడూ తెలుసుకోలేని విధంగా రేసింగ్ మోటార్‌సైకిల్ యొక్క అంతర్గత నిర్మాణాన్ని ఇది తెలియజేస్తుందన్నారు. స్వచ్ఛమైన కేటీఎం ఇంజనీరింగ్ తోనికేటీఎం 160 డ్యూక్ తేలికపాటి 164.2 సిసి సింగిల్ సిలిండర్, లిక్విడ్-కూల్డ్ ఇంజిన్‌తో పనిచేస్తుందన్నారు. ఇది క్లాస్ లీడింగ్ అయిన 19 పీ ఎస్ శక్తిని మరియు 15.5 ఎన్ ఎం టార్క్‌ను అందిస్తుందని, 160 ప్లాట్‌ఫారమ్ స్వచ్ఛమైన పనితీరు ఇంజనీరింగ్‌పై కేటీఎం యొక్క ముఖ్య దృష్టిని కొనసాగిస్తుందన్నారు. కొనుగోలు చేసే మొదటి మోటార్‌సైకిల్ అయినా లేదా అప్‌గ్రేడ్ అయినా, డ్యూక్ 160 అనేది తప్పక అనుభూతి చెందవలసిన అనుభవం అని, ఇందులో ఇప్పుడు 160సిసి నుండి 400సిసి వరకు నాలుగు మోటార్‌సైకిళ్లు ఉన్నాయని తెలిపారు.

# ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం

**– ఒక వ్యక్తి గల్లంతు**



**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** సామర్లకోట గోదావరి కాలువలో గుర్రపు డెక్క అవరోధాలు తొలగిస్తూ సామర్లకోట యానాదుల కాలనీకి చెందిన చేవూరి లోవరాజు(40) గల్లంతు ఐనా లోవరాజు కోసం తోటి గజ ఈతగాళ్లు గాలింపు చేపట్టారు. కనీస భద్రతా, జాగ్రత్త చర్యలు చేపట్టకుండా గోదావరి కాలువలో గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ గుర్రపు డెక్క అవరోధాల తొలగింపు చేపట్టిన ప్రాంతంలో కనిపించని అధికారులు ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం చోటు చేసుకున్నట్లు పేర్కొన్నారు.